# బాల కార్మికవ్యవస్థ... జాతి భవితకు గొడ్డలిపెట్టు

**'ఐదేళ్ల వయసు నుంచి మరణించే వరకు ఒకే ఒక మెట్టు. పుట్టినప్పటి నుంచి ఐదేళ్ల వరకే అసలైన జీవిత కాలం'.- పాస్కల్**

బాల్యంపై సుప్రసిద్ధ భౌతిక శాస్త్రవేత్త పాస్కల్ చేసిన పై వ్యాఖ్యానం ఎంతో అర్థవంతమైంది. మనిషి జీవితంలో బాల్య దశ ఎంతో విశిష్టమైంది. ఆ వయసులోనే.. ఆశావాదం, ఆత్మవిశ్వాసం వంటివి కలుగుతాయి. ప్రేమ, ఆప్యాయతలను ఆస్వాదించడం, వాటిని ఇతరులకు పంచడం చిన్నవయసులోనే జరుగుతుంది. బాల్యదశలో పొందిన ప్రేమానురాగాలు భావి జీవితాన్ని ప్రభావితం చేస్తాయి. బాల్యంలో కుటుంబ, సామాజిక వాత్సల్యాన్ని పొందనివారు, వయోజనులుగా సమాజంపట్ల ద్వేషం, నిర్లిప్తత పెంచుకుని, సంఘవిద్రోహ శక్తులుగా మారడానికి ఎక్కువగా ఆస్కారముంది. ఒక జాతి భవిష్యత్‌ను అంచనా వేయాలంటే.. జ్యోతిష్యులను సంప్రదించాల్సిన అవసరం లేదు. పసిపిల్లల ముఖాలను చూసి చెప్పవచ్చు.

2001 జనాభా లెక్కల ప్రకారం- మొత్తం దేశ జనాభాలో బాలలు (0-14 ఏళ్లు) 35 శాతం. వీరిలో 60 మిలియన్ల మంది (ఆరేళ్లలోపు) దారిద్ర్యరేఖకు దిగువ ఉన్నారు. 6 నుంచి 14 ఏళ్లలోపు పిల్లల్లో సగం కంటే ఎక్కువ మంది పాఠశాలలకు వెళ్లడం లేదు. ప్రతి రెండో బాలుడు లేదా బాలిక పౌష్టికాహార లోపంవల్ల అస్వస్థతకు గురవుతున్నారు. ప్రతి ఏటా 20 లక్షల మంది బాలలు సంవత్సరం నిండక ముందే మరణిస్తున్నారు. 10 కోట్లమంది బాలల కుటుంబాలకు నీటి సౌకర్యం లేదు. ప్రతి ఏటా 70 నుంచి 80 లక్షల మంది బాలలు అతిసార వ్యాధితో మరణిస్తున్నారు. ప్రతి 11 మందిలో ఒకరు అయిదో సంవత్సరం నిండక ముందే మరణిస్తున్నారు. పాఠశాలలకు వెళ్లే బాలల్లో 1/3వ వంతు మంది ఎనిమిదో తరగతి చేరేసరికి వివిధ కారణాల వల్ల బడి మానేస్తున్నారు. ఇటీవల జరిపిన సర్వే ప్రకారం.. అయిదో తరగతి చదివే బాలల్లో 50 శాతం మంది ఒకటో తరగతికి చెందిన పాఠాలను చదవలేని స్థితిలో ఉన్నారు. రెండో తరగతి చదివే 40 శాతం బాలలు 10 వరకు అంకెలు చెప్పలేని స్థితిలో ఉన్నారు. మనకు స్వాతంత్ర్యం సిద్ధించి 60 ఏళ్లు దాటినా భావి భారత పౌరుల పరిస్థితి ఈ విధంగా దైన్యంగా ఉండటం శోచనీయం.

**కారణాలివి...! :**

దారిద్ర్యం, నిరక్షరాస్యత, సమాజంలో చైతన్య రాహిత్యం, రాజకీయ నాయకులలో కొరవడిన చిత్తశుద్ధి, అసమర్థ, అవినీతిమయ పాలనా యంత్రాంగం వంటి అనర్థాలే బాలల్ని ఈ దుస్థితిలోకి నెడుతున్నాయి. రాజ్యాంగపరమైన రక్షణలు, చట్టపరమైన, పాలనాపరమైన చర్యలు ఈ దుస్థితిని తొలగించడంలో ఆశించినంత విజయవంతం కాలేదు. ప్రపంచంలో ఎక్కడా లేనంతగా భారత దేశంలో బాలకార్మిక వ్యవస్థ కొనసాగుతోంది. మన దేశంలో ఒక కోటీ 70 లక్షల మంది బాలకార్మికులు ఉన్నట్లు గణాంకాలు వెల్ల

డిస్తున్నాయి. వీరిలో 54 శాతం వ్యవసాయ రంగంలో, 15.5 శాతం నిర్మాణ రంగంలో, 18 శాతం గృహ కార్యకలాపాలు, 5 శాతం ఉత్పత్తి రంగంలో పనిచేస్తున్నారు. దేశ కార్మిక వ్యవస్థలో 5-14 ఏళ్ల లోపు బాలలు 6.75 శాతం. పాఠశాలలకు వెళ్లే వారు 67.44 శాతం మాత్రమే. 18.80 శాతం బాలలు కార్మిక రంగంలో గాని, పాఠశాలల్లో గాని లేరు. ప్రపంచవ్యాప్తంగా 15 కోట్ల 80 లక్షల మంది బాలకార్మికులుండగా.. వీరిలో 61 శాతం ఆసియా ఖండంలోనే ఉన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ జాతీయ కమిషన్ అధ్యక్షురాలు శాంతాసిన్హా అభిప్రాయ పడినట్లు-'ప్రభుత్వ ముఖ్య లక్ష్యం బాలలకు పౌష్టికాహారం, విద్య అందించడమే కావాలి. ఎన్నికల సమయాల్లో అన్ని రాజకీయ పక్షాలు సమాజంలోని విభిన్న వర్గాలైన మహిళలు, గ్రామీణ ప్రజలు, షెడ్యూల్డ్ కులాలు, తెగలు వంటి వారికి పెద్ద పీట వేస్తూ మ్యానిఫెస్టోలు విడుదల చేస్తాయి. కానీ.. 35 కోట్లకు పైగా ఉన్న బాలల ప్రస్తావన ఉండదు. బహుశా వీరికి ఓట్లు లేకపోవడమే కారణం కావచ్చు! కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లలో పిల్లలకు కేటాయించే వనరులు ఐదు శాతం కంటే తక్కువే. బాలల భవిష్యత్‌కు వనరులను కేటాయించడం జాతీయ ఆవశ్యకత. దురదృష్టవశాత్తు మన రాజకీ య నాయకులకు చిత్తశుద్ధి, ముందుచూపు లేదు. సమాజంలో ప్రభావ వర్గాలైన వ్యవసాయదారులు, కార్మికులు, ఉద్యోగులు ఏదైనా విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి తేగలరు. బాలలకు శక్తిమంతమైన ప్రభావం లేకపోవడమే కాకుండా వీరి కోసం పని చేసే స్వచ్ఛంద సేవాసంస్థల ఉనికి కూడా అంతంత మాత్రమే.

## పథకాలు:

పసిపిల్లలకు, తల్లులకు, గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారాన్ని అందించే లక్ష్యంతో 1975-76లో సమగ్ర బాలల అభివృద్ధి పథకాన్ని (ICDS) ప్రారంభించారు. సుప్రీంకోర్టు చొరవతో ప్రయోగాత్మకంగా ప్రారంభమైన ఈ పథకాన్ని దేశవ్యాప్తంగా ఆరేళ్లలోపు వయసు గల బాలలందరికీ వర్తింపజేశారు. దీన్ని అమలు చేయడానికి 7.44 లక్షల అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. 4.07 కోట్లమంది బాలలు, 0.91 కోటి మంది తల్లులు లబ్ధి పొందుతున్నారు. ఈ పథకం అమలు సంతృప్తికరంగా లేదని ప్రపంచ బ్యాంకు సర్వేలో తేలింది. పిల్లలకు, తల్లులకు ఉద్దేశించిన పోషకాహారం వాస్తవంగా వారికి కాకుండా కొందరు అవినీతిపరుల పరమవుతోందనే విమర్శలు ఉన్నాయి. వీరిని జవాబుదారులు చేసే యంత్రాంగం లేదు. అలాగే... పిల్లలను బడికి ఆకర్షించడానికి, వారి ఆరోగ్య పరిస్థితి మెరుగుపరచడానికి ఉద్దేశించింది 'మధ్యాహ్న భోజన పథకం'. ఇది దేశవ్యాప్తంగా అమల్లో ఉంది. అనేక రాష్ట్రాలలో మహిళా స్వయం సహాయక సముదాయాలు ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. దీంతో పేద బాలబాలికల బడి హాజరు శాతం పెరిగింది. దీని అమల్లోనూ కొన్ని లోపాలు లేకపోలేదు.

## బాల కార్మిక వ్యవస్థ :

ఒకవైపు జాతీయ స్థూల ఆదాయం 8-9 శాతంగా పెరుగుతూ అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ

పడుతున్న భారత్‌లో ప్రపంచంలోనే అత్యధిక మంది బాలకార్మికులు ఉన్నారు. పేదరికం, అసమర్థ విద్యా విధానం, సామాజిక సంప్రదాయాలు (బిడ్డలు తల్లిదండ్రుల వృత్తిని వంశపారంపర్యంగా కొనసాగించడం), తల్లిదండ్రుల నిరక్షరాస్యత, తక్కువ వేతనానికి బాలకార్మికులు లభిస్తుండటం వంటివి దీనికి ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు.

అసంఘటిత రంగాలైన అగ్గిపెట్టెలు, బీడీ తయారీ, కార్పెట్లు, వజ్రాలు, పలకలు, పెన్సిళ్లు, బలపాలు, తాళాలు, గాజుసామగ్రి, బాణసంచా తయారీ పరిశ్రమల్లో పని చేస్తున్నారు. వీరంతా తక్కువ వేతనంతో పాటు, ప్రమాదకరమైన వాతావరణంలో ప్రతిరోజు 10-15 గంటలు పని చేస్తున్నారు. 24వ రాజ్యాంగ ప్రకరణ ప్రకారం... 14 సంవత్సరాలలోపు పిల్లలు ప్రమాదకరమైన వృత్తులు చేపట్టడం నిషిద్ధం. కానీ ఇది అమలుకు నోచు కోవడం లేదు. బాల్యాన్ని, యవ్వనాన్ని దోపిడీ నుంచి రక్షించాలి' అంటూ రాజ్యాంగ ప్రకరణలు 39(e), (f) చెబుతున్నాయి. బాలకార్మిక వ్యవస్థ నిషేధ చట్టం 1986లో అమలులోకి వచ్చింది. బాలల ప్రయోజనాలను పరిరక్షించడానికి 2007లో కమిషన్ ఏర్పాటైంది. కార్మిక మంత్రిత్వశాఖ చొరవతో 600 జిల్లాల్లో జాతీయ బాలకార్మిక వ్యవస్థ నివారణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా ప్రమాదకర పరిశ్రమలు, హోటళ్లు, ఇళ్లలో పని చేసే బాల కార్మికుల విముక్తి కోసం కృషి చేస్తారు. 1.25 కోట్ల బాలకార్మికుల ను విముక్తి చేయడం ఈ కార్యక్రమ లక్ష్యం. విముక్తులైన బాలలకు స్వచ్ఛంద సేవా సంస్థల సహాయంతో ప్రత్యేక నివాసానుబంధ పాఠశాలలు (Residential Schools) ఏర్పాటు చేశారు. సర్వశిక్ష అభియాన్ పథకం కింద వీటికి నిధులు విడుదల అవుతాయి. ఈ పథకం వల్ల విముక్తి పొందిన బాలలు అతి తక్కువ శాతం. రాష్ట్రాలవారీగా బాలకార్మిక సంఖ్యను లెక్కిస్తే... ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌లు ప్రథమ, రెండో స్థానంలో ఉన్నాయి. ఆ తర్వాత బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లు నిలుస్తాయి. పేదరికమే బాలకార్మిక వ్యవస్థకు దోహదం చేస్తుందనే వాదన వాస్తవం కాదు. ఉత్తరప్రదేశ్, కేరళలల్లో దారిద్ర్యరేఖకు దిగువనున్న వారి శాతం ఒకటే. కాని కేరళలో 88 శాతం అక్షరాస్యత ఉంటే ఉత్తరప్రదేశ్‌లో అది కేవలం 55 శాతం, కేరళలో బాలకార్మికులు అతి తక్కువ, ఉత్తరప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో ఉంది.

మధ్యతరగతి, సంపన్న కుటుంబాలకు చెందిన బాలలు చదువు, ఆటపాటలతో తమ బాల్యాన్ని ఆస్వాదిస్తుంటే, పేద కుటుంబాలకు చెందిన బాలలు అతి తక్కువ వేతనంతో, ప్రమాదకర పరిసరాల్లో రోజుకు 10-15 గంటల వరకు పని చేస్తున్నారు. వారికి బాల్యమంటే ఏమిటో తెలియదు. అనాధ బాలల పరిస్థితి మరింత విషాదకరం. ఎంతో మంది అనాధలు ప్రతిరోజు ఉదయాన్నే చెత్తకుండీల్లో పారేసిన ఆహారం కోసం పందులు, కుక్కలు, కాకులతో పోటీ పడుతుంటారు. ప్లాస్టిక్, ఇనుము, ఇతర వ్యర్థపదార్థాల సేకరణలో నిమగ్నమవుతుంటారు. విషరసాయనాలు, పగిలిన గాజు పెంకులు వంటి వస్తువులు ఏరుతున్నప్పుడు వీరికి గాయాలు అవడంతోపాటు అనారోగ్య సమస్యలు ఎదుర వు తుంటాయి. బాలికలు ముఖ్యంగా లైంగిక వేధింపులకు గురవుతుంటారు. వీధి బాలల పునారావాస పథకం కింద పట్టణాలలో ప్రభుత్వ సహాయంతో స్వచ్ఛంద సేవాసంస్థలు తాత్కాలిక వసతి ఏర్పాట్లు

చేస్తున్నప్పటికీ అక్కడి కృత్రిమ వాతావరణం, అరకొర సదుపాయాలు ఎక్కువ మంది అనాథ బాలలను ఆకర్షించడం లేదు.

## పరిష్కారమేమిటి?

మొదటగా.. అన్నిరకాల బాలకార్మిక వ్యవస్థల్ని రద్దు చేయాలి. కేవలం చట్టాలు చేసినంత మాత్రాన ఫలితముండదు. ఎక్కువ మంది బాలలు మధ్యతరగతి, సంపన్న కుటుంబాల్లో పని చేస్తున్నారు. ముందుగా, సంపన్న వర్గాల్లో చైతన్యం రావాలి. తమ బిడ్డలకు సకల సౌకర్యాలు కల్పిస్తూ పేదపిల్లల బాల్యాన్ని హరిస్తూ వారితో వెట్టి చాకిరీ చేయించుకోవడం ఏ మేరకు సమంజసం? అనే విషయాన్ని ఆలోచించాలి. జాతీయస్థాయిలో ఉపాధి పథకాన్ని(వయోజనులకు) అమలు చేయాలి. తల్లిదండ్రులు, కుటుంబంలో వయోజనులు జీవనోపాధి పొందితే పిల్లలు పని చేయాల్సిన అవసరముండదు. అప్పుడు పిల్లలు బడికి వెళ్తారు. జాతీయ స్థూల ఆదాయంలో 10 శాతం విద్యకు, 5 శాతం ఆరోగ్యానికి ఖర్చు పెట్టాలి. విద్యావిధానంలో సమగ్ర మార్పులు రావాలి. పిల్లలకు ఆసక్తి కలిగించే, భవిష్యత్‌లో ఉపాధి అవకాశాలు కల్పించే వృత్తి విద్యా విధానం అవసరం. ఉపాధ్యాయుల్లో అంకిత భావం కావాలి.

వెట్టిచాకిరీ నుంచి విముక్తి పొందిన బాలలకు పునరావాసం కల్పించే ప్రక్రియలు, ప్రభుత్వ-ప్రభుత్వేతర సంస్థల మధ్య సరైన సమన్వయముండాలి. న్యాయవ్యవస్థ, పోలీసు యంత్రాంగం, కార్మిక శాఖ, సాంఘిక సంక్షేమ శాఖలు కలిసి పని చేయాలి. విముక్తి కల్పించడమే కాకుండా తిరిగి వారు మళ్లీ ఆ నరకకూపంలోకి వెళ్లకుండా చూడాలి. బాలల దినోత్సవం, 'వెట్టిచాకిరీ నుంచి విముక్తి' కార్యక్రమాలను ఆర్భాట ప్రకటనలకు పరిమితం చేయకుండా అమలు విధానాన్ని ఎప్పటికప్పుడు సమీక్షిస్తుండాలి. ప్రకటనల కోసం విరివిగా చేస్తోన్న వ్యయాన్ని బాల కార్మికుల పునరావాసం కోసం ఖర్చు చేయాలి. రాజ్యాంగంలోని 24వ ప్రకరణను సవరించి పిల్లలతో ప్రమాదకరమైన పనులే కాకుండా ఏ రకమైన పనులు చేయించినా నేరంగా పరిగణించాలి. 18 ఏళ్ల వయసు వరకు పిల్లలు ఏ రకమైన చాకిరికి గురి కాకూడదు.

గ్రామీణ ప్రాంతాల నుంచి బాలబాలికలు ఉద్యోగం నిమిత్తం పట్టణాలకు వెళ్లడం జరుగుతోంది. వీరు పట్టణాల్లో ఆలనా పాలనా లేక అన్నిరకాల దోపిడీలకి గురవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో భూసంస్కరణలు పటిష్టంగా అమలు చేస్తే, పేద ప్రజల పరిస్థితులు మెరుగుపడతాయి. తమ పిల్లల్ని పట్టణాలకు పంపించాల్సిన అవసరముండదు. ప్రభుత్వం విద్య, ఇతర అవకాశాల విషయాల్లో కల్పిస్తోన్న వసతుల గురించి నిరక్ష్యరాస్యులైన తల్లిదండ్రులకు అవగాహన లేకుండా పోతోంది. వీరికి అవగాహన కల్పించేందుకు బడిబాట లాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలి. స్వచ్ఛంద సేవా సంస్థలు, పౌర సమాజం, ప్రభుత్వం ఉమ్మడిగా కృషిచేయాలి. 'బాలల ప్రగతి దేశ ప్రగతికి సోపానం' అనే విషయాన్ని మనం విస్మరించరాదు.